క్లుప్తంగా

పెద్దాపురం ఎంపీడీఓగా సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

పెద్దాపురం: స్థానిక ఎంపీడీఓగా సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా పని చేసిన శ్రీలలిత డీఎల్‌డీఓగా పదోన్నతిపై విశాఖపట్నం బదిలీ కాగా ఆమె స్థానంలో ఏలేశ్వరం మండలం డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న సూర్యనారాయణ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని సామర్లకోట ఈఓపీఆర్‌డీగా పని చేసిన అనుభవంతో ఇక్కడి ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛమందించి స్వాగతం పలికారు.

భావితరాల కోసం నీటి వృథా అరికట్టాలి

సామర్లకోట: భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ నీటి వృథా అరికట్టడంపై దృష్టి సారించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాగునీటితో పాటు, సాగునీరు వృథాను అరికట్టడంతో పాటు, విద్యార్థులు చేతులను శుభ్రతపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీదుర్గ, శిరిష, బాల శైలజ, సైదున్నిషా బేగంలు పాల్గొన్నారు.

కౌమార దశలో మార్పులపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఫణిశ్రీ

సామర్లకోట: పిల్లల కౌమార దశలో వచ్చే మార్పులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని స్థానిక పౌర సంఘం ప్రతినిధి నూతలపాటి ఫణిశ్రీ అన్నారు. స్థానిక యర్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం హెచ్‌ఎం శ్రీదేవి అధ్యక్షతన కౌమార దశలో పిల్లల్లో కలిగే మానసిక మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ దశలో తీసుకోవలసిన జాగ్రత్తపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, కె.అరుణ, సీహెచ్ భద్ర, ఎస్.రామలక్ష్మి, ఎస్‌కే రజియా బేగం, వీఎన్ దేవి, పౌరసంఘ ప్రతినిధులు మొగిలి దిలీఫ్, శింగంశెట్టి శ్రీనివాసరావు పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తీర ప్రాంతంలో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్



ఉప్పాడ తీరంలో చెత్తను తొలగిస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్ తీర ప్రాంతంలో బుధవారం మత్స్యకార సంక్షేమ సమితి, ఆన్‌కాయిస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తీర ప్రాంతంలో ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

అరుణాచలంలో 'అలమండ' నృత్య ప్రదర్శన



అరుణాచలంలో పురస్కారం అందుకున్న ప్రసాద్

సామర్లకోట: స్థానిక అంతర్జాతీయ కళాకారుడు అలమండ ప్రసాద్ తమిళనాడులో ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం తిరువన్నామలై అరుణాచలంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేసి అవార్డును అందుకున్నారు. ఇప్పటికే ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేసుకున్న విషయం విదితమే. ఈనెల 16వ తేదీన జరిగిన అరుణాచలం నాట్యాంజలి కార్యక్రమంలో కాకినాడ జిల్లా నుంచి అలమండ ప్రసాద్ పాల్గొన్నాడు. ఈ విషయాన్ని బుధవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపాడు. తెలంగాణ , భద్రాచలం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం నుంచి నృత్య కళాకారులు పాల్గొన్నట్లు ప్రసాద్ చెప్పారు. అరుదైన అవకాశం కల్పించిన ఆలయ అధికారులు, భద్రాద్రి సంస్కృతిక వారిధి నృత్య గురువు కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బొప్పాయి సాగు.. లాభాలు బాగు

- యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి
- లాభాలు ఆర్జిస్తున్న మెట్ట రైతులు



చినబ్రహ్మదేవంలో సాగవుతున్న బొప్పాయి తోట



బొప్పాయి చెట్టుకు భారీగా కాసిన కాయలు

పెద్దాపురం: మెట్ట ప్రాంతంలో బొప్పాయి సాగు లాభాల బాటలో నడుస్తోంది. రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలతో పాటు కోస్తాలో అధికంగా పండించే బొప్పాయి మెట్ట ప్రాంతంలోనూ ఈ సాగు రైతులకు ఆదాయలను సమకూరుతోంది. ప్రధానంగా పెద్దాపురం మండలంలోని చినబ్రహ్మదేవం, జె.తిమ్మాపురం, కట్టమూరు. ఆర్‌బీపట్నం, కొత్తూరు, కొండపల్లి. ఆనూరు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో బొప్పాయి పంటపై రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. నారు దశ మొదలు ఎరువుల యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతులు, కోత, దిగుబడి వంటి అంశాలపై ఉద్యాన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో బొప్పాయి సాగు మెట్ట రైతాంగానికి లాభాలు చేకూరుస్తుందనే చెప్పుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

చెట్టు వయసును బట్టి ఎరువులను వినియోగించాలి. ఏకలింగాశ్రయ దీర్ఘకాలిక రకాల బొప్పాయి ఒక్క మొక్కకు పది కిలోల పశువుల ఎరువు, 12 కిలోల వేపా లేదా ఆముదపు పిండి, 500 గ్రాముల యూరియా, 1.6 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ 800 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వినియోగించాలి. రెండు నెలలకోసారి ఏడాదిలో ఆరు సార్లు ఎరువులను వేయాలి. సూక్ష్మదాత లోప నివారణ ఐదు గ్రాముల జింక్ సల్ఫేట్, ఒక గ్రాము బోరాక్స్ లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. డ్రిప్ ద్వారా ఎరువులను అందించే పక్షంలో 13.5 గ్రాముల యూరియా, 19.5 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాషియం, వారం రోజుల వ్యవధితో 48 వారాలు ఇవ్వాలి. ఏకవార్షిక రకాలకు ఎరువులను ఏడో నెల వరకు అందించాలి.

ఫెర్టిగేషన్

సిఫారసు చేసిన ఎరువులను కరగబెట్టి వడగట్టిన తరువాత ఫెర్టిగేషన్ ట్యాంక్ లేదా ఫుట్ స్ప్రేయర్ ద్వారా గాని డ్రిప్ మెయిన్ పైపులోకి ప్రవేశపెట్టాలి. బాస్వరపు ఎరువుని ఫాస్ఫేట్ రూపంలో ప్రతి రెండు నెలలకోసారి 260 గ్రాములు చెట్టుపాదులో కలపాలి.

నీటి యాజమాన్యం

మొక్క మొదళ్ల దగ్గర నీరు తగులకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పిల్ల పాదులు (డబుల్‌రింగ్‌పద్ధతి) తయారు చేసి నీరు పారించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టిన అధిక దిగుబడులు సాధించవచ్చు. డ్రిప్ ద్వారా చిన్న మొక్కలైతే రెండు రోజులకోసారి 8 లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు వేసవిలో ప్రతి 20-25 లీటర్ల నీటిని అందేలా డ్రిప్పర్లు అమర్చుకోవాలి. వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు అందించాలి.

కోత, దిగుబడి

మంచి సైజు వచ్చిన కాయలను చెట్టు మీద మాగనీయకూడదు. వాటిని కోసి పేపర్‌తో చుట్టి రవాణా చేసుకోవాలి. నాటిన 9వ నెల నుంచి రెండున్నర సంవత్సరాల వరకు పంట లభిస్తుంది. ద్విలింగ పుష్పాల నుంచి ఎదిగే కాయలను తక్కువ పొడవుతో గుండ్రంగా ఉంటాయి. అదే ఆడపుష్పాల నుంచి ఎదిగే కాయలు పొడవుగా, కోలగా ఉంటాయి. దిగుబడి ఎకరాకుల 35 నుంచి 40 టన్నుల వరకు ఉంటుంది.

మంచి ఆదాయం వస్తోంది



మెట్ట ప్రాంతంగా కావడంతో ఎక్కువ అపరాలు, పండ్ల తోటలను వేస్తాం. ప్రధానంగా మామిడి, జీడిమామిడితో పాటు బొప్పాయి సాగు చేస్తాం. వీటి నుంచి మంచి ఆదాయం వస్తుంది. అధికారుల సూచనలతో మరింత జాగ్రత్తగా సాగు చేపట్టడంతో బొప్పాయి సాగు దిగుబడి బాగుంది.

–ఆచంట శివ, బొప్పాయి సాగు రైతు, చిన బ్రహ్మదేవం, పెద్దాపురం మండలం

బొప్పాయి ఆరోగ్యకరం



బొప్పాయి పండు ఆరోగ్యానికి మంచిది. బొప్పాయిలో విటమిన్ సీ, ఏ యాంటి అక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపర్చడానికి సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచడంతో పాటు కొన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది.

–డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

అధినేతతో ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గంలో పరిస్థితులు వివరిస్తున్న వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలు తీసుకుంటున్న చర్యలు అధినేతతో చర్చించారు.

దవులూరి పరామర్శ

పెద్దాపురం: దివిలి మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు, కొత్తెం బాలకృష్ణ కుటుంబాన్ని బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పరామర్శించారు. శ్రీరామ్మూర్తి మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామంలో సీనియర్ రాజకీయ వేత్తగా శ్రీరామ్మూర్తి చేసిన సేవలను కొనియాడి కోటి, బాలకృష్ణలను ఓదార్చారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ నాయకులు గోపు మురళి, నరాలశెట్టి త్రినాద్, వట్టికూటి రాజ్‌కుమార్, తదితరులున్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై ధర్నాకు సిద్ధం



శాంతియుత ధర్నాలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పెద్దాపురం: గ్రామ రెవెన్యూ సహాయ అధికారులు (వీఆర్‌ఏ)ల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నుంచి 21వ తేదీ వరకు చేపట్టే ఆందోళనకు తాము సిద్ధంగా ఉన్నామని పెద్దాపురం వీఆర్వోల అసోషియేషన్ ప్రకటించింది. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా ధర్నా చేస్తున్నట్టు బుధవారం స్థానిక తహసీల్దార్, పోలీస్ అధికారులకు వీఆర్‌ఏలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ సంఘం నాయకులు దువ్వాపు వీరబాబు, సుందరపల్లి రామలింగేశ్వరారవు, నూకతట్టు వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేపడతున్నామన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయం, 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయం, 21వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేపడుతుమన్నారు. వీఆర్‌ఏలు ప్రతీ ఒక్కరూ ఈ ధర్నా కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

గోదావరి కాలువ గట్టుకు రక్షణ కల్పించండి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రైతు



తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డికి ఫిర్యాదు అందజేసిన శ్రీరంగనాయకులు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువ గట్టుకు ప్రాధాన్యత కల్పించాలని రైతు నాయకుడు బిక్కిన శ్రీరంగనాయకులు బుధవారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత ఉన్న గోదావరి కాలువ గట్టుమాండవ్యనారాయణస్వామి ఆలయం సమీపంలో గోదావరి కాలువ గట్టు తవ్వకం చేసినా పట్టించుకునే వారు కనిపించడం లేదన్నారు. గోదావరి కాలువ గట్టు తవ్వకం చేసిన ప్రదేశాన్ని మండల మెజిస్ట్రేట్‌గా తహసీల్దార్ పరిశీలించినా ఎటువంటి చర్యలు లేవన్నారు. సర్వేయర్ అందుబాటులో లేని కారణంగా చేయడంలేదని ఆయన వచ్చిన తరువాత సర్వే చేయిస్తామని చెప్పి ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదన్నారు. పూర్వం నుంచి మాండవ్యనారాయణస్వామి ఆలయ సమీపంలో ఉన్న భూమిని అనుభవిస్తున్న యజమాని గోదావరి కాలువ గట్టుపై ఎటువంటి తవ్వకం ఆక్రమణ చేయలేదన్నారు. అయితే ఇటీవల ఆ భూమి యజమాని ఆ భూమిని అమ్మకం చేయడంతో కొనుగోలుదారుడు గోదావరి కాలువ గట్టును తవ్వకం చేయడంతోపాటు, పంట కాలువను మూసి వేయనున్నట్టు ఆరోపించారు. కొనుగోలు చేసిన భూమిని లేఅవుట్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ భూమిలో భవన నిర్మాణం జరుగుతుందని శ్రీరంగనాయకులు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎఫ్‌ఎంబీ కాపీ, అడంగల్ వన్‌బీ రిజిస్టర్ కాపీ, బెటర్‌మెంట్ కాపీ, రెవెన్యూ ల్యాండ్ కాపీలు ఇప్పించాల్సిందగా సమాచారం చట్టం ప్రకారం తహసీల్దార్‌ను కొరిన్నట్లు శ్రీరంగ నాయకులు విలేకర్లకు చెప్పారు. గోదావరి కాలువ గట్టు తవ్వకంతో బలహీన పడి పోయిందని, వరదలు వచ్చిన సమయంలో గట్టు కోతకు గురి అయ్యే ప్రమాదం ఉన్నదని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించక పోతే కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

మహిళల కోసమే 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్'



గోర్సలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ, గోర్సలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ, రాజ్‌కుమార్ పర్యవేక్షణలో స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

సామర్లకోట: మహిళల ఆరోగ్యం కోసం ప్రధాని జన్మదినోత్సవం సందర్భంగా ప్రారంభించిన స్వస్థ్ నారీ-సశక్త్ పరిహార్ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబులు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ వైద్య సేవలు అక్టోబరు 2 వరకు నిర్వహిస్తామని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టరు అమల తెలిపారు. మహిళలు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు వైద్యం అందిస్తామన్నారు. ఈ శిబిరాలల్లో కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య పరీక్షలు, ఆయుష్ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డాక్టరు స్వప్న, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, వైద్యులు పాల్గొన్నారు. ఈ మేరకు మహిళలకు పోషణ అభియాన్ కిట్లు అందజేశారు.

ప్రజలను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం



పాత ఇసుకపల్లిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం భూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అనాల సుదర్శన్ అన్నారు. మండలంలో పాత ఇసుకపల్లి, కొండెవరం గ్రామా కమిటీ అధ్యక్షుడు గుల్లపల్లి వీరభద్రరావు, గాది గంగబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు అవుతున్న విధానం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, లేదంటే వాటి అమలకు గ్రామస్థాయి నుంచి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకి అవగాహన కల్పించారు. అన్నీ సమయాల్లోను ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంగలి సుబ్బారావు, ఎరకం దివాకర్ రెడ్డి గుర్రల తాతారావు, ఇంటి బాబ్జి, గొర్ల పోతన్న, కూతా నాగిరెడ్డి, మేడిశెట్టి శ్రీరాములు, వేమగిరి నాని, వాసంశెట్టి సూర్య ప్రకాష్, గాది సత్య, గుల్లపల్లి వెంకటరమణ, గుర్రాల ఎలీనా, అనపర్తి నాని, బొబ్బరాడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్



సామర్లకోట బ్రిడ్జిపై బారులు తీసిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం వాహనాలు బారులు తీశాయి. బ్రిడ్జిపై అడుగు అడుగునా గోతులు ఉండడంతో వాహనాల యజమానులు గోతులను తప్పించుకొనే క్రమంలో ఎడమ వైపు నుంచి కుడి వైపునకు వస్తున్నారు. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గత నెల రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చక పోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పెద్దాపురం -రాజానగరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాల నుంచి వచ్చే బస్సులతో బ్రిడ్జి రద్దీగా ఉంటోంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో కళాశాల విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో చిన్న వాహనచోదకులు కూడా రాక పోకలు సాగించడానికి అవకాశం ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ప్రధాని మోదీ సేవలు అభినందనీయం

పెద్దాపురం: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోది దేశ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు గొరగపూడి చిన్నయ్యదొర అన్నారు. మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామంలో మాదా మణిబాబు ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్యదొర మాట్లాడుతూ మెదీ సేవలను కొనియదారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏడిద కృష్ణ, బొలిశెట్టి రామ్‌కుమార్, పోతుల ప్రభాకర్, కరెల్ల శ్రీదేవిక, కంచుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌లో

స్థానిక రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు 15 రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలిరోజున రక్తదాన శిబిరంతో ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో దొరయ్య, బీజేపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి



ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: పేద పిల్లలకు వైద్య విద్య అందాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలను తీసుకొని వస్తే వాటిలో 10 మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేసి విద్యార్థులకు కూటమ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తును చంద్రబాబునాయుడు అంధకారం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలు చదువుకుంటే విద్యను ఎవరూ దొంగలించలేరనే మంచి లక్ష్యంతో మెడికల్ కళాశాల ఏర్పాటుకు జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వచ్చారన్నారు. పేద విద్యార్థులు డాక్టర్లు అయితే పేదవారి కష్టం తెలిసి సేవాభావంతో వారికి మంచి వైద్యం అందిస్తారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ మేరకు ఈనెల 19వ తేదీ రాజమహేంద్రవరం మెడికల్ కళాశాల వద్ద పెద్ద ఎత్తున బీసీ కులాల విద్యార్థులు, యువతతో చలో మెడికల్ కళాశాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

కొత్తపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎన్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లిలో ఉదయం 8 గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

భువనేశ్వరీ పీఠంలో రాట ముహూర్తం



కొత్తపల్లిలో పసుపురాటను వేస్తున్న భక్తులు



భువనేశ్వరీ పీఠంలో దేవీ నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక వర్థుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో దేవీ నవరాత్ర ఉత్సవాలకు శనివారం పందిరి రాట మూహూర్తం నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పందిరి రాటను వేశారు. ఈ సందర్భంగా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ గత 26 ఏళ్లగా అమ్మవారి పీఠంలో నవరాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి చ్చే నెల 2వ తేదీ వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు అమ్మవారి పూజలుంటాయన్నారు. నవరాత్రులు ముగిసిన నేపథ్యంలో పదో రోజున విశేష అర్చన, అలంకరణతోపాటు పూర్ణాహుతి, సాయంత్ర జమ్మిచెట్టుకు పూజ ఉంటాయని పేర్కొన్నారు. ప్రత్యక్ష, పరోక్షంగా పూజలు, చండీహోమాల్లో పాల్గొనే భక్తులు 9866193557 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు. దేవి మాలను ధరించేవారు ముందుగానే సంప్రదించాలని తెలిపారు.

కొత్తపల్లి: స్థానిక గాదులదొడ్డిలో ఉన్న బాలకనకదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలకు బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. సాంప్రదాయబద్ధంగా జరిగే నవరాత్ర ఉత్సవాల ప్రారంభానికి పసుపు రాటను వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి పూజలు చేశారు.

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలోని శారదారామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 66వ శరన్నవరాత్ర ఉత్సవాలకు ముహూర్తపు రాటను బుధవారం వేశారు. సేవాసమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీశారదా రామకృష్ణ సేవాసమితి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి రోజు ఏకవార రుద్రాభిషేకం, లలితా సహస్రనామ పారాయణ, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. 29వ తేదీన విద్యార్థులతో సామూహిక సరస్వతి పూజ, 30నసామూహిక అష్టలక్ష్మీ పూజలు ఉంటాయన్నారు. అక్టోబరు 2న పూర్ణాహుతి కార్యక్రమం, అన్న సమారాధనలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి విజంమూరి విశ్వనాథం, సభ్యులు నువ్వుల వెంకట్రాజు, బాబ్జి, చందవోలు వీరవెంకటసత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్ లక్ష్యం



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుదామని రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీరు బి.శివప్రసాద్, స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వే ప్రయాణికులకు క్లాత్ బాగ్‌లను పంపిణీ చేశారు. అక్టోబరు 2 నుంచి రైల్వే స్టేషన్ ఆవరణలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, టీటీఐ చైతన్య, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.